సాక్షి విశాఖపట్నం

బుధవారం, 24, మే, 2023



సివిల్స్‌లో మెరిసిన తురువోలు బిడ్డ

చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన హేమంత్ సివిల్స్‌లో 469 ర్యాంకు సాధించాడు. 8లో



కేజీహెచ్‌కు మరో పది వాహనాలు

కేజీహెచ్‌కు మరో పది మహా ప్రస్థానం వాహనాలు సమకూరనున్నాయి. వీటిని మృతదేహాల తరలింపునకు వినియోగించనున్నారు. 8లో



షూటింగ్ సందడి

తగరపువలస దాకమర్రిలోని ఓ కళాశాలలో మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 8లో

న్యూస్‌రీల్

రైతు బజార్లలో పార్కింగ్‌కు 2న వేలం

మహారాణిపేట : రైతు బజార్లలో ఖాళీగా ఉన్న స్థలంలో పార్కింగ్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు గాను పార్కింగ్ నిర్వహణకు జూన్ 2వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంచరపాలెం రైతుబజార్‌లో రూ.45 వేలు, ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో రూ.89 వేలు, పెదవాల్తేరు రైతుబజార్‌లో రూ.19,549, గోపాలపట్నం రైతు బజార్‌లో రూ.70,149 బేస్ రేట్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. పార్కింగ్‌లో సైకిల్‌కి రూ.2, ద్విచక్ర వాహనానికి రూ.5, ఆటోకి రూ.10, కారుకు రూ.20 చార్జీ నిర్ణయించామన్నారు. వివరాలకు 9030819082 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎంఎస్‌ఎంఈ అవార్డ్స్‌కు గడువు పెంపు

విశాఖ విద్య: మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్‌ఎంఈ) జాతీయ స్థాయి అవార్డుల దరఖాస్తులకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కేఎల్ఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆయా రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి అవార్డుల కోసం ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. జాతీయ స్థాయిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. https://dashboard.msme.gov.in వెబ్‌సైట్ ద్వారా తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 0891-2517942 లేదా 9420921175 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్యుల నియామకం కోసం 26న ఇంటర్వ్యూలు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీలోని 26 డిపార్టుమెంట్లలో సీనియర్ రెసిడెంట్ల (వైద్యులు) నియామకం కోసం ఈనెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిబాబు తెలిపారు. డిపార్టుమెంట్ల వారీగా ఖాళీలు, దరఖాస్తు ప్రొఫార్మా కోసం www.amc.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. వివరాలకు 9848314843 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఏయూ ఇంజనీరింగ్ సెల్ఫ్‌సపోర్ట్ ప్రవేశాలు ప్రారంభం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో బీటెక్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని పేర్కొన్నారు. 24వ తేదీన ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సీఏపీ, దివ్యాంగుల విభాగాలకు సర్టిఫికెట్ల పరిశీలన జరుపుతామన్నారు. ఎన్‌సీసీ, క్రీడా విభాగాలవారు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు, మిగతావారు ఈ నెల 28వ తేదీలోగా సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 29 నుంచి జూన్ 3వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జూన్ 5న తొలిదశ సీట్ల కేటాయింపు జరుపుతామన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూన్ 6 నుంచి 10వ తేదీలోగా నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ కోర్సుకు రూ. 2 లక్షలు, ఈసీఈ కోర్సుకు రూ 1.5 లక్షలు, మెకానికల్ ఇంజనీరింగ్‌కు రూ 1.25 లక్షలు, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సులకు రూ. లక్ష వార్షిక ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు ఏయూ ప్రవేశాల సంచాలకుల వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కేకే లైన్‌లో జరుగుతున్న ప్రి నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు, విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే విశాఖపట్నం-కోరాపుట్ (18512) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26, 29 తేదీల్లోను, కోరాపుట్-విశాఖపట్నం(18511) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 27, 30 తేదీల్లోను, విశాఖపట్నం-కోరాపుట్ (08546) పాసింజర్ స్పెషల్ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు, కోరాపుట్-విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు, విశాఖపట్నం-రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు, రాయ్‌పూర్-విశాఖపట్నం(08527) పాసింజర్ స్పెషల్ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేశారు.

బదిలీల కోలాహలం

- నేటి నుంచి దరఖాస్తుల ప్రక్రియ
- ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికగా బదిలీలు
- 5 వేల మంది ఉపాధ్యాయులకు అవకాశం
- బడి తెరిచే రోజుకు ప్రక్రియ పూర్తి చేసేలా ఏర్పాట్లు



విశాఖలోని డీఈవో కార్యాలయం

విశాఖ విద్య : జిల్లా విద్యాశాఖలో బదిలీల కోలాహలం మొదలైంది. బదిలీ కోరుకునే వారు, తప్పనిసరి బదిలీల జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం, ఈసారికి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలకు అవకాశం కల్పించటంతో సొంత గ్రామాలు, వాటి సమీప పాఠశాలలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ఉవ్విళ్లూరుతున్నారు. బడులు తెరిచే నాటికి బదిలీల ప్రక్రియ ముగించేలా విద్యాశాఖాధికారులు షెడ్యూల్ ప్రకటించటంతో విద్యా సంవత్సరానికి ఎటువంటి ఆటంకం ఉండదని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయనేది అప్పుడే ఆరా తీస్తున్నారు. తమకు వచ్చే పాయింట్ల ఆధారంగా ఏ స్కూల్లో చోటు దక్కుతుందోననే లెక్కలు వేసుకుంటున్నారు. ఏ ఇద్దరు ఉపాధ్యాయులు కలిసినా, ఇదే విషయమై చర్చించుకుంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేడర్లు కలిపి సుమారు 5 వేల మందికి స్థాన చలనం కలిగే అవకాశం ఉందని అంచనా.

పారదర్శకంగా బదిలీలు

టీడీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల బదిలీలు అంటే అదో పెద్ద ప్రహసనంగా సాగేది. నాయకులు, ప్రజా ప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బదిలీల్లో పారదర్శకతకు పెద్దపీట వేసింది. పైరవీలకు ఆస్కారం లేకుండా అంతా ఆన్‌లైన్ విధానంలోనే బదిలీలు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ఇంట్లో నుంచే ఆన్‌లైన్ ద్వారా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక ఇంట్లో ఉండే బదిలీ ఉత్తర్వులు అందుకునే అవకాశాన్ని కల్పించారు.

ఖాళీల సేకరణకు కసరత్తు

బదిలీల ప్రక్రియ ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్నందున, విశాఖపట్నం డీఈవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. కేడర్ల వారీగా ఖాళీలను సేకరిస్తున్నారు. దీనిపై ఉప విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి జాబితాలను తీసుకుంటున్నారు. బదిలీ దరఖాస్తు సమయంలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా, జిల్లా మెడికల్ బోర్డుచే ధ్రువీకరించిన లేటెస్ట్ సర్టిఫికెట్‌ను జత చేయాలని ముందుగానే వివరిస్తున్నారు. అదే విధంగా స్పౌజ్ విషయంలో పూర్తి స్థాయి పరిశీలన చేయనున్నారు.

షెడ్యూల్ ఇలా..

- 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- 25 నుంచి 27 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- 28 నుంచి 29 వరకు ప్రొవిజనల్ సీనియార్టీ జాబితాల ప్రదర్శన
- 30న సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ
- 31, జూన్ 1న అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం
- జూన్ 2, 3 తేదీల్లో తుది సీనియార్టీ జాబితా వెల్లడి
- 4న కేడర్ల వారీగా ఖాళీల ప్రదర్శన
- 5, 6 తేదీల్లో హెచ్‌ఎంలు, 5 నుంచి 7 వరకు స్కూల్ అసిస్టెంట్లు, 5 నుంచి 8 వరకు సెకండరీ గ్రేడ్ టీచర్లు వెబ్ ఆప్షన్లకు గడువు
- 9న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, 9 నుంచి 11 వరకు ఎస్జీటీల బదిలీ ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 100 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 63,159 మంది విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. బుధవారం నుంచి జూన్ 1 వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి, రెండో సంవత్సరం కలిపి విశాఖ జిల్లాలో 40,986 మంది, అనకాపల్లిలో 16,807 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 5,366 మంది విద్యారులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 63,159 మంది పరీక్షలు రాయనున్నారు. విశాఖ జిల్లాలో 62, అనకాపల్లిలో 25, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అడ్వాన్స్‌డ్ పరీక్షలకు కూడా జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌తో పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

సప్లిమెంటరీ పరీక్షలకు సైతం ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థుల సౌకర్యార్థం బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. హాల్ టికెట్‌తో విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ఆరు ఫ్లైయింగ్, ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. అన్ని కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో సాంకేతిక సమస్యతో నిలిచిపోయిన రెండో యూనిట్‌లో మరమ్మతుల అనంతరం మంగళవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించారు. 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో బాయిలర్‌లో అమర్చిన ట్యూబ్‌కు రంధ్రం ఏర్పడి సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. సాంకేతిక నిపుణులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి మంగళవారం రాత్రి 9 గంటలకు లైటప్ చేసి విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. బుధవారం ఉదయానికల్లా యూనిట్ నుంచి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు.

మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి(విశాఖ దక్షిణ): మత్తు పదార్థాల రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరును సీపీ సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్ల వివరాలు, వారిపై నిఘా చర్యలను ఆరా తీశారు. బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వంటి కార్యకలాపాలు నగరంలో ఎక్కడా జరగకుండా నిరోధించాలని ఆదేశించారు. నగరంలో రహదారి భద్రతపై దృష్టి సారించాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాలని, ట్రాఫిక్ రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలపై వేధింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలని చెప్పారు. పోక్సో కేసులపైనా ఆరా తీశారు. క్రైమ్ రేట్ తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు. విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను పూర్తిగా లా అండ్ ఆర్డర్, క్రైమ్ సిబ్బంది అందరూ వినియోగిస్తూ నిందితులను మరింత వేగంగా గుర్తించాలన్నారు. ఎస్ఈబీ బృందాలుగా ఏర్పడి నగరంలో ఉన్న విద్యా సంస్థల వద్ద నిఘా ఉండాలని, అలాగే ప్రధాన ప్రాంతాల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై బ్యానర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. లోక్ అదాలత్‌లో గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసులు, అందుకు గల కారణాలను తెలుసుకొని సత్వరమే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే నేర సమీక్షా సమావేశంలో ప్రతి పోలీస్‌స్టేషన్ ప్రస్తుత నెల కంటే నేరాలు తగ్గుముఖం పట్టే విధంగా పోలీసింగ్ ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో డీసీపీ- విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 ఆనంద రెడ్డి, ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల వరకు పాల్గొన్నారు.

వాహనదారుల ప్రతి కదలిక రికార్డు

అల్లిపురం: వాహన చోదకుల ప్రతి కదలిక రికార్డు అవుతుందని.. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ హెచ్చరించారు. పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోడ్డుపై ఎలా వెళ్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని భ్రమపడవద్దన్నారు. ఒక్కసారి వాహన చోదకులు దొరికితే వాహనంపై గల అన్ని చలాన్లు వసూలు చేస్తామన్నారు. ప్రతి రోజు 1500 వరకు చలాన్లు మీ సేవ ద్వారా వసూలు అవుతున్నాయన్నారు. వాహన చోదకులు తమ వాహనాలను అపార్ట్‌మెంట్లు, దుకాణాల ఎదుట, నో పార్కింగ్ ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసినా, సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేసినా, రాంగ్ రూట్‌లో వాహనం నడిపినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా ఫైన్ కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఇటీవల బీచ్‌రోడ్డులో ఆంక్షలు విధించామని సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- నాలుగేళ్ల అభివృద్ధిని ప్రజలకు వివరించాలి
- 'జగనన్నే మన భవిష్యత్తు' సూపర్ హిట్
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమం, అభివృద్ధిపై ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారితో పాటు ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నాలుగేళ్లలో 96.5 శాతం ఎన్నికల హామీలు అమలు చేశామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించాలన్నారు. రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇటీవల చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సూపర్ డూపర్ హిట్ అయిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ సర్వేలో పాల్గొన్న ప్రతీ వైఎస్సార్ సీపీ సైనికుడికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల కాలం చాలా కీలకమన్నారు. అంతా సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేటర్లంతా బాధ్యత తీసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా..వార్డుల్లో డ్రైనేజీ, వీధిలైట్లు, మంచినీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ పటిష్టంగా ఉంటేనే మనమంతా బాగుంటామన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే టీడీపీ ఖాళీ అయిపోయింది.. ఆ పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకులంతా మన వైపే చూస్తున్నారన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడమే లక్ష్యంగా కార్పొరేటర్లంతా పని చేయాలని కోరారు. నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత 1.50 వేల మందికి సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకంపై కూడా పచ్చ పత్రికల్లో తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నారని, సోషల్ మీడియా ద్వారా వాటిని తిప్పికొట్టాలన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కె.సతీష్, జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, అక్కరమాని వెంకట్రావ్, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



నాలుగేళ్ల సంబరాలు

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి మంగళవారం నాటికి నాలుగేళ్లు కావడంతో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ ఆధ్వర్యంలో టీటీడీ చైర్మన్, రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు కేక్ కట్ చేశారు.

ఉన్నతాధికారుల సూచనల మేరకే తనిఖీలు

దొండపర్తి : 'వసూళ్లలో కళావర్ కింగ్', 'మసాజ్ పోలీస్ మస్తు వసూల్' పేరుతో సాక్షిలో వచ్చిన కథనాలపై టాస్క్‌ఫోర్ ఏసీపీ ఎ.త్రినాథరావు, ఏసీపీ(ఎస్‌బీ) వై.గోవిందరావు స్పందించారు. స్పా, మసాజ్ సెంటర్లపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఉన్నతాధికారుల సూచనల మేరకే వాటిల్లో తనిఖీలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 2023, ఏప్రిల్ 10వ తేదీన స్టీల్‌ప్లాంట్ పరిధిలో జూదం ఆడుతున్న మువ్వ గోపాలుడుతో పాటు 9 మందిని పట్టుకొని అక్కడ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు వివరించారు. అలాగే గత సీపీ ఉత్తర్వుల మేరకు స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ ఆదేశాల మేరకు గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో స్థానిక పోలీసులను తీసుకొని 6 స్పా, మసాజ్ సెంటర్లలో తనిఖీలు చేసినట్లు ఏసీపీ(ఎస్‌బీ) వై.గోవిందరావు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్పా, మసాజ్ సెంటర్లపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రాధాకృష్ణ

సూపరింటెండెంట్‌కు అశోక్‌కుమార్‌కు అస్వస్థత

మహారాణిపేట: కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అస్వస్థతకు గురయ్యారు. సోమవారం విధి నిర్వహణలో ఉండగా ఛాతిలో నొప్పి రావడంతో పరీక్షలు నిర్వహించారు. అనంతరం కేర్ ఆస్పత్రికి తరలించారు. ఈనెల 29వ తేదీ వరకు ఆయన సెలవు పెట్టారు. దీంతో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ రాధాకృష్ణ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

చర్చ సుదీర్ఘం.. సమగ్రం!

- పలు అంశాలపై చర్చించిన సభ్యులు
- గైర్హాజరు అధికారులపై గరం గరం
- ప్రశాంతంగా సాగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం
- హాజరైన ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, విప్ ధర్మశ్రీ



హాజరైన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి, విశాఖపట్నం: చాలా ఏళ్ల తర్వాత జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సుదీర్ఘంగా సాగింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా అనేక అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 వరకు దాదాపు ఏడు గంటల పాటు ఈ సర్వసభ్య సమావేశం కొనసాగింది. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సహా పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యారు. అజెండాలోని అన్ని అంశాలతో పాటు తమ ప్రాంతంలోని సమస్యలను ప్రస్తావించారు. ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుకను స్థానిక రీచ్‌ల నుంచి ఉచితంగా తరలించుకునేందుకు అనుమతులివ్వాలని, వాటి పరిధులను స్పష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. పరవాడ పారిశ్రామిక ప్రాంతంలో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, సీఎస్సార్ నిధులతో అక్కడ ఒక అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని జేసీ జాహ్నవికి సూచించారు.

తొలుత పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడు, ఐదు స్థానాల్లో నిలిచిన విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేయడం, నాడు-నేడులో స్కూళ్ల రూపురేఖలు మార్చడం, తగినంత మంది టీచర్లను నియమించడం వంటివి ఉత్తమ ఫలితాలకు కారణమయ్యాయని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో టెన్త్ ఫలితాల్లో వెనకబాటుకు కారణాలు తెలుసుకుని వచ్చే ఏడాదికి మెరుగు పరచుకోవాలని సూచించారు. ఆ జిల్లాలో విద్యా బోధన ఎలా ఉందో తరచూ హైస్కూళ్లను పర్యవేక్షించాలని చైర్‌పర్సన్ సుభద్ర జెడ్పీటీసీలను కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ సూచించారు.

ప్రమాదాల్లో మరణించిన వారిని అనకాపల్లి తరలించాల్సి వస్తోందని, చోడవరంలోనే పోస్టుమార్టం జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అధికారులకు సూచించారు. కేజీహెచ్‌లో మాదిరిగా అనకాపల్లి జిల్లా ఆస్పత్రుల్లోనూ రెండు పూటలా ఓపీ సేవలు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కోరారు. సమావేశంలో విశాఖపట్నం జేసీ కేఎస్ విశ్వనాథన్, అనకాపల్లి జేసీ జాహ్నవి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ల గైర్హాజరుపై అసహనం

సర్వసభ్య సమావేశానికి విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవో హాజరు కాలేదు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలివ్వాల్సిన, గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవలసిన కలెక్టర్లే హాజరు కాకపోవడం సరికాదని జెడ్పీ చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సర్వసభ్య సమావేశానికి హాజరు కానిపక్షంలో తనతో పాటు జెడ్పీటీసీలంతా బహిష్కరిస్తామని హెచ్చరించారు. జెడ్పీ సమావేశం సమాచారాన్ని ముందుగా మీడియాకు తెలియజేయక పోవడంపై జిల్లా పౌర సంబంధాల అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీఈవోను ఆదేశించారు. జూన్‌లో మూడు విడతల్లో జెడ్పీటీసీలకు బాపట్ల, సామర్లకోటల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చైర్‌పర్సన్ సుభద్ర తెలిపారు.

ఈపీడీసీఎల్‌కు అభినందనల వెల్లువ

సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ అధికారులకు అభినందనలు వెల్లువెత్తాయి. సమస్యలు, ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటున్నారని పలువురు సభ్యులు కొనియాడారు.

ఇక సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే..

- డీటీసీ రాజారత్నం
- తుది దశకు చేరుకున్న ఆధునిక ఫిట్‌నెస్ వెహికల్ డ్రైవింగ్ టెస్ట్ నిర్మాణం

గోపాలపట్నం : మరో రెండు నెలల్లో రవాణా శాఖలో అన్ని సేవలు ఆన్‌లైన్‌లో జరుగుతాయని డీటీసీ రాజారత్నం పేర్కొన్నారు. గంభీరంలో నిర్మాణంలో ఉన్న అత్యాధునిక డ్రైవింగ్ టెస్ట్, ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్లు మరో రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయన్నారు. వీటి ద్వారా పూర్తి పారదర్శకతతో పౌర సేవలు అందుతాయని చెప్పారు. ఇన్‌స్పెక్షన్ సర్టిఫికేషన్ కేంద్రాన్ని రూ.16.5 కోట్లతో రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఇది పూర్తయితే 12 రకాల పరీక్షలు పూర్తి యంత్రాల ద్వారా జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలు ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. ఈ విధమైన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ పరీక్షా కేంద్రం రాష్ట్రంలో మొదటిసారిగా ఇక్కడ నిర్మాణం జరుగుతోందన్నారు.

సీసీ కెమెరాలు, సెన్సార్లు

ఆటో మేటెడ్ వెహికల్ డ్రైవింగ్ ట్రాక్‌లో సీసీ కెమెరాలు, సెన్సార్లు ఏర్పాటు చేశారు. టెస్ట్‌కు హాజరైన వ్యక్తి ఈ ట్రాక్ గుండా ఏవిధంగా డ్రైవ్ చేస్తున్నాడో పూర్తి స్థాయిలో రికార్డు చేస్తుంది. వాహన తనిఖీదారుల ప్రమేయం లేకుండా కంప్యూటరే పరీక్షిస్తుంది. ఈ పరీక్షలో పాసయితే లైసెన్స్ మంజూరవుతుంది. లేని పక్షంలో తిరిగి పరీక్షలకు హాజరు కావలసిందే. దీంతో డ్రైవింగ్ టెస్ట్ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని డీటీసీ రాజారత్నం తెలిపారు. రవాణా శాఖలో వివిధ సేవలకు htpps://aprtacitizen. epragathi. org/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే వినియోగదారులు దగ్గర్లో ఉన్న సీఎస్‌సీ సెంటర్ల ద్వారా కూడా సేవలు పొందవచ్చని రాజారత్నం తెలిపారు.

కళలకు ఏయూ ప్రోత్సాహం అభినందనీయం



ఏయూ వీసీతో ఆర్.నారాయణ మూర్తి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం ఏయూ అభివృద్ధి చేస్తున్న కె.వి గోపాల స్వామి ఆరుబయలు రంగస్థలాన్ని సందర్శించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి, తీర్చిదిద్దుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కళలకు, నాటక రంగాన్ని పెద్దపీట వేసే విధంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసాద రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్ పేరును సార్థకత తీసుకువచ్చే విధంగా అధికారులు చేస్తున్న కృషిని మనస్ఫూర్తిగా అభినందించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు ఇన్‌చార్జిల నియామకం





ముత్తంశెట్టి వెంకట శివసాయి, పీలా వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జోనల్ (విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి) ఇన్‌చార్జిలను నియమించారు. యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ముత్తంశెట్టి వెంకట శివసాయి సందీష్, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా పీలా వెంకటలక్ష్మిని నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

వెదుళ్లనరవలో టీడీపీ కార్యకర్త బరితెగింపు

- ఆక్రమణలు తొలగిస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌పై దౌర్జన్యం
- పోలీసుకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు



వెదుళ్లనరవలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్లు, బేస్‌మెంట్‌ను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌ను వేలు చూపించి హెచ్చరిస్తున్న టీడీపీ కార్యకర్త రాము

సబ్బవరం : గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఇటువంటి సంఘటన మండలంలోని వెదుళ్లనరవలో చోటుచేసుకుంది. స్పందనలో అందిన ఫిర్యాదు మేరకు ఆక్రమణలను తొలగించేందుకు డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది వెదుళ్ల వలస వెళ్లారు. ఆక్రమణలు తొలగిస్తుండగా టీడీపీ కార్యకర్త వీరంగం సృష్టించారు. రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్నాడు. డిప్యూటీ తహసీల్దార్‌పై దౌర్జన్యానికి పాల్పడడంతోపాటు బైక్ తాళాలను లాక్కోనేందుకు యత్నించాడు. రెవెన్యూ అధికారులు విషయాన్ని జాయింట్ కలెక్టర్‌కు తెలియపర్చి తదనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ వివరాల ప్రకారం.. ఈ నెల 22న స్పందనలో వెదుళ్ల వలస సర్వే నంబర్ 121లో రెండు రేకులు షెడ్లు నిర్మించారని వెదుళ్లనరవ శివారు కొత్తూరుకు చెందిన టీడీపీ కార్యకర్త చెట్టి రాము ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌తో పాటు ఆర్‌ఐ వీరయ్య మిగిలిన సిబ్బందితో కలిసి ఆక్రమణలను తొలిగించేందుకు జేసీబీని తీసుకు వెళ్లారు. సర్వే 117లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నట్టు గతంలో ఫిర్యాదు అందింది. దీంతో పాటు 121లో ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు సిద్ధపడ్డారు. అయితే 121 సర్వే నంబర్‌లో టీడీపీ కార్యకర్త రాముకు చెందిన బేస్‌మెంట్ ఉండడంతో రెవెన్యూ అధికారులతో గొడవ పడ్డాడు. ఇదిలా ఉండగా సర్వే నెంబర్ 121లో అక్రమంగా నిర్మించిన రెండు షెడ్లకు సంబంధించిన స్థలాన్ని 2018లో రాము తమకు అమ్మాడని, తాము ఇటీవల ప్రహరీ నిర్మిస్తుండగా అడ్డుకుని రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని బాధితురాలు ఉరుకూటి చినతల్లి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. తాము డబ్బులు ఇవ్వకపోవడంతో స్పందనలో ఫిర్యాదు చేసి అక్రమ నిర్మాణాలు అంటూ హడావుడి చేస్తున్నాడన్నారు. 2018లోనే షెడ్ వేసుకోని విద్యుత్ మీటర్, ఇంటి పన్ను కడుతూ కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నామని, రూ.2 లక్షలు ఇవ్వకపోవడం వలనే తమకు ఈ పరిస్థితి వచ్చిందని, అధికారులకు న్యాయం చేయాలని చినతల్లి వేడుకుంది.

తబలా వాయిద్యకారుడు శివ మృతి



తబలా వాయిద్యకారుడు శివ

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): నగరానికి చెందిన ప్రముఖ తబలా విద్వాంసుడు సింహాద్రి సాంబశివ (55) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మద్దిలపాలెంలో నివాసముంటున్న ఆయన ఉదయం కాఫీ తాగుతుండగా హైబీపీ రావడంతో హుటాహుటిన కేజీహెచ్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని శివ స్వగ్రామం విజయనగరానికి తరలించారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలో రోషన్‌లాల్, ఆలాపన, కీరవాణి, మిలీనియం తదితర ఆర్కెస్ట్రాలలో తబలా ఆర్టిస్టుగా శివ ఎంతో పేరు తెచ్చుకున్నారు. సినీ గాయకులు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సుశీల, చిత్ర, ఎస్.జానకి, మనో, వి.రామకృష్ణ, ఆనంద్, వాణి జయరాం తదితర సినీ గాయకులు విశాఖలో నిర్వహించిన సంగీత విభావరిలో తబలా ఆర్టిస్టుగా వ్యవహరించారు.

పలువురు నివాళి .. శివ మృతి ఉత్తరాంధ్ర సంగీత కళాకారులకు తీరని లోటని విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షులు మహ్మద్‌ఖాన్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నా తిరుమలరావు, వివిధ కళాసంఘాల ప్రతినిధులు మెలోడి సత్యనారాయణ, బయ్యా శ్రీనివాస్‌లు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పెందుర్తి పాలిటెక్నిక్‌లో

హెల్ప్‌లైన్ కేంద్రం

సింహాచలం : పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల సౌకర్యార్థం పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 1 నుంచి 6 వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. పీహెచ్, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరీ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే నెల 2 నుంచి 5వ తేదీ వరకు పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు ఈ నెల 25 నుంచి appolycet. nic. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.250 చెల్లించాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు, రెండు సెట్ల జెరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్లు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. వచ్చే నెల 9న సీట్ల కేటాయింపుల జాబితా విడుదల కానున్నట్టు వెల్లడించారు.

చదువుల తల్లికి

బాసటగా..

- 'అయ్యో..ఎంత కష్టం' కథనానికి స్పందన
- రూ.40వేలకు ఆర్థిక సాయం
- సాక్షికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థి మహాలక్ష్మి

సాక్షి స్పందన

దాబాగార్డెన్స్: 'అయ్యో..ఎంత కష్టం' పేరిట సాక్షి మంగళవారం ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆ విద్యార్థినికి పలువురు బాసటగా నిలిచారు. తోచిన సాయం చేసిన వారు కొందరైతే..రెండు..మూడ్రోజుల్లో సాయం అందిస్తామని ఫోన్లు చేసినట్టు ఆ విద్యార్థిని మహాలక్ష్మి తెలిపారు.

శ్రీకాకుళం జిల్లాకు చెందిన గోగులమఠం అప్పారావు కుటుంబం పొట్టకూటి కోసం విశాఖ వలస వచ్చింది. ఓ అపార్ట్‌మెంట్‌లో వాచమన్‌గా అప్పారావు పనిచేస్తుండగా, భార్య రాధ ఇళ్లల్లో వంట పనులు చేస్తూ కుమార్తె మహాలక్ష్మిని బీటెక్ చదివిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న వసతి దీవెన, విద్యా దీవెనతో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న తరుణంలో తండ్రి అప్పారావు అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందాడు. అప్పటికే ఏడాది కాలంగా రాధా క్యాన్సర్‌తో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. పుట్టెడు దుఃఖంలో ఉన్న విద్యార్థిని ఆవేదనను సాక్షి గుర్తించి కథనం ప్రచురించింది. ఆ కథనానికి దాతలు స్పందించి చదువుల తల్లికి బాసటగా నిలిచారు. రూ40వేలకుపైగా ఆర్థిక సాయం అందించారు. దీంతో ఆ విద్యార్థిని సాక్షికి కృతజ్ఞతలు తెలిపింది.

ఆర్థిక సాయం అందజేసే దాతలు..

ఆర్థిక సాయం అందజేయాలనుకునే దాతలు ఇండియన్ బ్యాంక్, అకౌంట్ నంబరు 6948419465, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఐడీఐబీ 000పీ182కు జమ చేయవచ్చు. లేదా 7093756870 నంబరుకు ఫోన్ చేసి ఆర్థిక సాయం అందజేయవచ్చు.

శరత్‌బాబు సంతాప సభ నేడు

మద్దిలపాలెం: సినీ నటుడు శరత్‌బాబు మృతికి సినీ రంగానికి తీరని లోటు అని, ఆయన సంతాప సభ బుధవారం నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు పేర్కొన్నారు. ఏయూ హిందీ భవన్‌లో ఉదయం 10.45 గంటలకు నిర్వహించనున్న సంతాప సభకు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

సదస్సుల ద్వారా టీడీఎస్‌పై అవగాహన

బీచ్‌రోడ్డు : మూలం వద్ద పన్ను(టీడీఎస్) చెల్లింపు ప్రాముఖ్యతను తెలిపేందుకు అవగాహన సదస్సులను నిర్వహించాలని ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ పి.శంకర్ పాండి, డిప్యూటీ కమిషనర్ వై.విష్ణువర్ధన్ రెడ్డిలు తెలిపారు. సిరిపురంలోని విశాఖపట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో టీడీఎస్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న వారు మాట్లాడుతూ టీడీఎస్ మినహాయింపు ఆవశ్యకతను వివరించారు. టీడీఎస్‌ను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని సూచించారు. త్రైమాసిక స్టేట్‌మెంట్లను సకాలంలో దాఖలు చేయాలన్నారు. టీడీఎస్ చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను అధికారి ఎన్.రేణుకాదేవి, ఇన్‌స్పెక్టర్లు పి.ఎస్.ఎస్.కుమార్, పి.వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



బీచ్‌రోడ్డు: సరదాగా సముద్ర స్నానం చేస్తున్న ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తూ అలల్లో చిక్కుకుపోయారు. అక్కడే విధుల్లో ఉన్న లైఫ్‌గార్డ్స్ తక్షణం స్పందించి వారిని రక్షించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆర్కే బీచ్ వద్ద మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఒడిశాకు చెందిన కిరణ్, లోకేష్ స్నానం చేస్తున్నారు. ఒక పెద్ద అలా రావడంతో అందులో చిక్కుకుపోయారు. అక్కడ విధుల్లో ఉన్న లైఫ్‌గార్డ్స్ వెంటనే రంగంలోకి దిగి వారిని రక్షించారు. అనంతరం వారికి ప్రథమ చికిత్స అందించారు.

రౌడీషీటర్ ఆత్మహత్య

పెదగంట్యాడ: మండలానికి చెందిన ఓ రౌడీ షీటర్ ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూ పోర్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని సిద్ధేశ్వరంలో గాలి శ్రీనివాసరావు (అలియాస్ గాలి శ్రీను) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. గతంలో అతని పై పలు కేసులు ఉండడంతో న్యూ పోర్టు పోలీసులు అతని పై రౌడీషీట్ తెరిచారు. ఇదిలా వుండగా శ్రీను స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులకు వెళ్తున్నాడు. క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడిన అతను అప్పులు చేశాడు. అవి తీర్చలేక మంగళవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షూటింగ్ సందడి

కొమ్మాది : తగరపువలస దాకమర్రిలోని ఓ కళాశాలలో మంగళవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నటుడు సంపూర్ణేష్‌బాబు, హీరోయిన్ మంత్ర, ప్రతికథానాయకుడు అమిత్ నటిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఆర్‌కే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాకు దర్శకుడిగా వెంకట్, నిర్మాతగా రాజ్‌కుమార్, ప్రొడక్షన్ మేనేజర్లుగా లీలా ప్రసాద్, రాము వ్యవహరిస్తున్నారు.

సివిల్స్‌లో మెరిసిన తురువోలు బిడ్డ

- 469వ ర్యాంకు సాధించిన హేమంత్
- ఐఏఎస్ కావడమే లక్ష్యమని వెల్లడి

ఉక్కునగరం: మండలంలోని తురువోలు గ్రామానికి చెందిన హేమంత్ సివిల్స్‌లో 469 ర్యాంకు సాధించడం పట్ల బంధువులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన బొడ్డు సత్తిబాబు, బాల దంపతులు ఉద్యోగ రీత్యా విశాఖలో స్థిరపడ్డారు. సత్తిబాబు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కాగా బాల ప్రొఫెసర్. వీరి కుమారుడు హేమంత్ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు శివశివానీ పాఠశాలలోను, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో చదువుకున్నాడు. ఇంటర్ విజయవాడలోని చైతన్య కళాశాలలో పూర్తి చేశాడు. ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన అనంతరం సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. మంగళవారం వచ్చిన సివిల్స్ ఫలితాల్లో ఆలిండియాలో 469 ర్యాంకు సాధించాడు. తమ ఊరు బిడ్డ సివిల్స్‌లో ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హేమంత్ తమ్ముడు హరి గౌహతి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. ఈ ర్యాంక్ ద్వారా ఐఆర్ఎస్ వస్తుంది.. అందులో చేరి మళ్లీ సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని హేమంత్ తెలిపారు.

కేజీహెచ్‌కు మరో పది మహా ప్రస్థానం వాహనాలు

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆస్పత్రికి మరో పది మహాప్రస్థానం వాహనాలు సమకూరనున్నాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన వారిని సొంత గ్రామాలకు తరలించడానికి మహా ప్రస్థానం వాహనాలను ఉపయోగిస్తున్నారు. కేజీహెచ్‌లో ప్రస్తుతం ఏడు వాహనాలు మాత్రమే ఉన్నాయి. ఇవి సరిపోకపోవడం లేదని భావించిన కలెక్టర్ ఎ.మల్లికార్జున మరో పది వాహనాల కోసం ప్రయత్నించారు. హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ నిధుల ద్వారా వీటిని సమకూర్చేందుకు ముందుకొచ్చింది. దీంతో కొనుగోలుకు టెండర్లు పిలిచారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వారిని మహాప్రస్థానం వాహనాల ద్వారా తరలిస్తుంటారు. రోజుకు సరాసరి పది నుంచి 15 మృతదేహాలను వివిధ ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. జనవరిలో 380, ఫిబ్రవరిలో 400, మార్చిలో 410, ఏప్రిల్‌లో 428 మృతదేహాలను కేజీహెచ్ మహాప్రస్థానం వాహనాల ద్వారా తరలించారు.

ప్రభుత్వ రంగాలను కాపాడుకుంటాం



మాట్లాడుతున్న దిలీప్

డాబాగార్డెన్స్: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకుంటామని ఎల్‌ఐసీ ఏఓఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీజీ దిలీప్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులుగా ఎల్‌ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 6వ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తోందన్నారు. ఎల్‌ఐసీ పాలసీదారులు, ఉద్యోగులు, ఏజెంట్లను సంప్రదించకుండా ఎల్‌ఐసీని ఐపీఓకి పెట్టడం, ఏజెంట్లు, పాలసీదారులను నష్టపరిచేందుకు బీమాసుగం పథకాన్ని తెచ్చిందన్నారు. ఈ పథకం వల్ల ఎల్‌ఐసీ ఉద్యోగులతో పాటు ఏజెంట్ల వ్యవస్థ కూడా ధ్వంసమయ్యే అవకాశం ఉందన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, ఎల్‌ఐసీ ఐపీఓ విధానం రద్దు, బీమాసుగంను రద్దు చేయాలని మహాసభలో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. కేంద్రం తన వైఖరి మార్చుకునేవరకు ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీలు ఎపీ బెల్లార్‌మిని, డాక్టర్ సంపత్, సౌత్ జోనల్ ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు, ఎల్ మంజునాథ్, సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కేఎం కుమార్ మంగళం పాల్గొన్నారు.